

నీరున్నా.. తాగు నీటి కష్టాలు!

రోజులు తరబడి నీరు అందక ప్రజల ఇక్కట్లు



ట్యాంకర్ నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పూతలపట్టు: పూతలపట్టు మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో నీరు పుష్కలంగా ఉన్నా.. ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. రోజులు తరబడి కాలనీకి నీరు అందక పోవడంతో వేల రూపాయలు సొంత డబ్బు వెచ్చించి ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కాలనీలో రెండు బోర్లు వున్నా నీటి సరఫరా చేసేందుకు అధికారులు తగిన ఏర్పాటు చేయక పోవడంతో ఈ దుస్థితి నెలకొంది. మరి కొందరికి చేతి బోర్లు దిక్కుగా మారాయి. సుమారు వంద కుటుంబాలు ఉన్న కాలనీ వాసులు తాగునీటి కోసం నిత్యం అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారంలో ఒక్క రోజు నీరు కూడా రావడం గగనంగా మారిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలనీకి తాగునీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపు విజయవంతంగా నిర్వహించండి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న ఓట్ల లెక్కింపును విజయవంతంగా నిర్వహించేందుకు, ఖచ్చితమైన ఫలితాలను త్వరితగతిన ప్రకటించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెలగపూడి నుండి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఎన్నికల సిబ్బంది, ర్యాండమైజేషన్, ఈటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపు, ఈవీఎంలలో ఫోల్డ్ అయిన ఓట్ల లెక్కింపునకు అవసరమైన శిక్షణ నిర్వహణ, రౌండ్ల వారిగా ఫలితాల ట్యాబులేషన్, ఎన్కోర్ లో ఫీడ్ చేయడం, అందుకు అవసరమైన ఐటీ సిస్టంల ఏర్పాటు, ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత ఈవీఎంలను సీల్ చేసే విధానంపై అవగాహన, స్టేట్యూటరీ నివేదిక, రౌండ్ వైజ్ నివేదికలు పంపించేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు, మూడు అంచెల భద్రతా వ్యవస్థ ఏర్పాటు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. చిత్తూరు జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారి ఎస్ షణ్మోహన్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు నకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో భారత ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి కేటాయించిన సిబ్బందికి సంబంధించిన రెండవ ర్యాండమైజేషన్ ఈ నెల 2వ తేదీ కౌంటింగ్ పరిశీలకులు, రాజకీయ పార్టీలు సమక్షంలో నిర్వహించామని, 3వ తేదీ కౌంటింగ్ సిబ్బందికి ఎస్‌వి సెట్ లో రెండవ విడత శిక్షణ ఇస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, పూర్తి నిఘా నీడలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత చేపట్టాల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రశాంతంగా ఓట్ల లెక్కింపునకు అన్ని విధాల సంసిద్ధం గా ఉన్నామని, ఇందుకు పక్కాగా అన్ని చర్యలు తీసుకుంటున్నా మని జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.

ఉదయం ఆరుకల్లా చేరుకోవాలి

- ఎలక్ట్రానిక్, సెల్‌ఫోన్లకు అనుమతి లేదు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని రాజకీయ పార్టీలు అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలు కల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఎలక్ట్రానిక్, సెల్ ఫోన్లకు అనుమతి లేదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ సగిలి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్ నిర్వహించిన సమావేశానికి విచ్చేసిన ఐదుగు రు కౌంటింగ్ పరిశీలకులు యండిషాదిక్ అలం. కవిత ఎస్ మాన్నికెరీ, డాక్టర్ భరత్ భూషణ్, డాక్టర్ బికె మమత , అఖోరి శశాంక్ సిన్హా , జాయింట్ కలెక్టర్ చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ ఛందోలు, రిటర్నింగ్ అధికారులతో కలసి ఎస్‌వి సెట్ లో ఈ నెల 4వ తేదీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ లో భాగంగా తీసుకున్న చర్యలు, కౌంటింగ్ కేంద్రాలలో అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు పాటించాల్సిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 4న ఎస్ వి సెట్‌లో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి ఓట్లు లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి పార్టీల అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు సహకరించాలన్నారు. చిత్తూరు, పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు, పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లు లెక్కింపునకు 15 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ను, పోస్టల్ బ్యాలెట్స్ కు 3 టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటికే కౌంటింగ్ సంబంధించి సూపరువైజర్లు, అసిస్టెంట్ సూపరువైజర్లకు మొదటి విడత శిక్షణ ఇచ్చామని, కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి రెండో విడత రాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించామని, 4వ తేదీ ఉదయం 5 గంటలకు టేబుల్స్‌కు కౌంటింగ్ సిబ్బంది ఏ టేబుల్ కు కేటాయించడం ర్యాండమేజేషన్ ద్వారా కేటాయిస్తామని తెలిపారు. 4వ తేదీ ఉదయం 6 గంటల కల్లా అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఐడి కార్డుతో పాటుగా ఫారం 18ని తప్పని సరిగా తీసుకొస్తేనే మెయిన్ గేట్ వద్ద అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ హాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్స్, పెన్నులు కూడా అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రంలో పెన్స్, పేపర్లు ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లకు వాహనాలకు కేటాయించిన పార్కింగ్‌లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు, కౌంటింగ్ ఏజెంట్లకు, అధికారులకు, మీడియాకు కౌంటింగ్ సిబ్బందికి అందరికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు కోసం ఆరు కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. మెయిన్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటంలో సేల్స్ ఫోన్స్ కౌంటర్ లో పెట్టి రావాలన్నారు. కౌంటింగ్ పరిశీలకులు రిటర్నింగ్ అధికారులు, ఏఆర్వోలు, కంప్యూటర్స్ ఆపరేటర్స్‌కు మాత్రమే సెల్ ఫోన్స్ కౌంటింగ్ కేంద్రంలో అనుమతి ఉందని తెలిపారు. అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు సమక్షంలో స్ట్రాంగ్ రూములను 4 న ఉదయం 6 గంటలకు ఓపెన్ చేస్తామన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వారా అందజేసిన అథారిటీ లెటర్స్ కలిగిన మీడియా ప్రతినిధులు మాత్రమే మీడియా సెంటర్ లోకి కెమెరాస్ సెల్ ఫోన్స్ తెచ్చుకోవచ్చునని, మీడియా ప్రతినిధులు మీడియా కేంద్రంలోనే ఉండాలన్నారు. మీడియా ప్రతినిధులు ఎవ్వరికీ కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని, సమాచార శాఖ అధికారులు, సిబ్బంది ఫోటోస్, వీడియోస్, రౌండ్ల వారీగా ఫలితాలను తీసుకొచ్చి మీడియా సెంటర్లో మీడియా ప్రతినిధులకు అందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి పుల్లయ్య గంగాధర్ నెల్లూరు, నగిరి, పూతలపట్టు, పలమనేరు, కుప్పం, పుంగనూరు అసెంబ్లీ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, వెంకట శివ, వెంకట్ రెడ్డి, జి. చిన్నయ్య, మనోజ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, మధుసూదన్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గం వైసిపి యం పి అభ్యర్థి యన్.రెడ్డెప్ప, పూతలట్టు అసెంబ్లీ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్, బిజెపి నుంచి అట్టలూరి శ్రీనివాసులు, సిపిఎం నుంచి గంగరాజు, కాంగ్రెస్ నుంచి పరదేసి, టిడిపి నుంచి రాహుల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

గుడిపాల ఎస్ఐపై వేటు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : 13 గత నెల 13వ తేదీ నిర్వహించిన పోలింగ్ రోజు గుడిపాల మండలం మండికృష్ణాపురం, గుడిపాలలో చోటు చేసుకున్న అలర్లను అదుపు చేయడంతో నిర్లక్ష్యం వహించారంటూ గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఆదివారం పోలీస్ ఉన్నతాధికారి నుండి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావుపై వేటు పడినట్లయింది.



బంగారుపాళెంలో జోరున కురుస్తున్న వర్షం

3 గంటల పాటు వర్షం

వివిధ పంటలకు నష్టం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలో ఆదివారం సాయంత్రం మూడు గంటలపాటు భారీగా వడగళ్ల వాన కురిసింది. దీంతో మండలంలోని గంగినాయన పల్లి, బైరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని రైతుల టమోటా, బీన్స్, వంకాయ, మామిడి రైతుల రైతులు పంటలకు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లింది. కొత్తూరు గ్రామానికి చెందిన వెంకటప్ప దోసకాయల పంట 30 సెంట్లు, శ్రీనివాసులు, వెంకటప్ప టమోటా వడగళ్ల వాన దెబ్బకి కాయలు నేలమట్టం అయ్యాయి. బైరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అల్తాఫ్ ఖాదర్ బాషా, మువినాకు చెందిన మామిడి కాయలు సుమారు ఐదు ఎకరాలకు పైనే మామిడి కాయల పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

చిత్తూరు డెస్క్: బంగారుపాలెంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో వేడి వాతావరణం తగ్గుముఖం పట్టింది. గత రెండు నెలలుగా ఎండవేడికి ఇబ్బందులు పడ్డ ప్రజలు తొలకరి చినుకులలో ఉపశమనం పొందారు. వేరుశనగ రైతులు దుక్కి చేసుకొని పంటకు సిద్ధమవుతున్నారు. పంటకు అదునైన వాతావరణం కనిపిస్తోం దని వేరుశనగ పంట బాగా రావచ్చునని వేరుశనగ రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

వడ దెబ్బకు మహిళ మృతి



వెంకటమ్మ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వడ దెబ్బకు మహిళ మృతి చెందిన సంఘటన వెదురుకుప్పం మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ బొప్పల మడుగుకు చెందిన నరసింహారెడ్డి భార్య తాతిరెడ్డి వెంకటమ్మ (74) శుక్రవారం పొలం పనులకు వెళ్లింది. ఎండ వేడిమికి వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. శనివారం రాత్రి బంధువులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రిలో చేర్చారు. ఆరోగ్యం క్షీణించి ఆమె ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



సోమలలో ఏనుగులు కూల్చివేసిన మామిడి చెట్లు

ఆగని గజ దాడులు

- సదుం, సోమల మండలాల్లో వివిధ తోటలపై దాడి
- రూ. లక్ష రూపాయల మేర నష్టం

ప్రజాశక్తి -సోమల, సదుం: సోమల, సదుం మండలాలలో పంట పొలాలు, వివిధ తోటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. సోమల మండల పేటూరు గ్రామానికి సమీపంలోని ఇర్లపల్లి ప్రాంతంలో ఏనుగులు శనివారం అర్ధరాత్రి సంచరించి అదే గ్రామానికి చెందిన చిట్టి అనే రైతుకు చెందిన మామిడి తోటలపై దాడి చేసి కొమ్మలు విరిచి వేసి చెట్లు పెకలించి దాదాపు లక్ష రూపాయల విలువ చేసే మామిడి కాయలను ధ్వంసం చేశాయని రైతు ప్రజాశక్తికి తెలిపారు. ఇటీవల కాలంలో ఒంటరి ఏనుగు సంచరిస్తుండగా దానికి మరొక రెండు ఏనుగులు కలిసి విధ్వంసానికి పాల్పడుతున్నాయని రైతులు పేర్కొన్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇద్దామనుకుంటే చరవాణిలు స్విచ్ ఆఫ్ చేసుకుని ఉన్నారని, పై అధికారులకు తెలపాలని రేంజర్ స్థాయిలో ఫోన్ చేసి విషయం చెప్పగా 'అవునా..ఏనుగులు వచ్చాయా.. ఎందుకు వచ్చాయి?' అని అంటూ వెటకారంగా మాట్లాడి రైతులను కించపరిచే విధంగా చూస్తున్నారని రైతు చిట్టి ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు సంవత్సరాల తరబడి పంట పొలాల పై ఏనుగులు దాడి చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ మొక్కుబడిగా వచ్చి సంఘటన స్థలాలను చూసి నష్టపరిహారం కోసం తహశీల్దారుకు దరఖాస్తు చేసుకోవాలని చెబుతూ ఉచిత సలహాలు ఇస్తూ వెళ్తున్నారే తప్ప ఏనుగులు పంట పొలాలపై దాడి చేయకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టలేదని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు సారవంతమైన భూములను ఏనుగుల చర్యల వల్ల బీడు భూములుగా మార్చి పంటలను సాగు చేయకుండా నిలిపివేశారని, మామిడి నీలగిరి ఇతరత్రా ఆదాయం వచ్చే చెట్లను పెంచుకున్నా వాటిని కూడా ఏనుగులు ధ్వంసం చేస్తుంటే ఇంకా ఎలా బతకాలంటూ ఈ ప్రాంత రైతులు అంటున్నారు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి రైతుల ఆందోళనను పరిశీలించి న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.



సదుంలో

సదుం మండల పరిధిలోని రైతుల పంట పొలాలపై గజరాజుల ఆగడాలు, దాడులు ఆగడం లేదు. శనివారం రాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో సోమల మండలం రాంపల్లి అటవీ ప్రాంతం నుండి సుమారు 13 ఏనుగులు సదుం మండలం వైపు వచ్చి గట్టు వారిపల్లి, చెరుకువారిపల్లి, బత్తల వారిపల్లి, నాయుని వారిపల్లి పరిధిలోని పంట పొలాలపై పడి టమోటా, మామిడి, అరటి పంటలకు నష్టం కలిగించాయి. జోగివారిపల్లికి చెందిన సి రెడ్డెప్ప రెడ్డి, మార్తు వారిపల్లి కి చెందిన ఎం నరసింహా రెడ్డి, బత్తల వారిపల్లి కి చెందిన రైతులు సావిత్రమ్మకు చెందిన టమోటా, మామిడి, అరటి పంటలను నాశనం చేశాయని సదుం మండల ఏరియా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహేష్ ఆదివారం 'ప్రజాశక్తి'కి తెలిపారు. గత వారం ఫారెస్ట్ అధికారులు ట్రాకెర్స్ సాయంతో ఏనుగుల గుంపును సోమల మండలం రాంపల్లి అటవీ ప్రాంతం లోకి తరిమి వేశారు. ఆ తరువాత ఒక రెండు, మూడు రోజుల తరువాత ఏనుగుల దాడులు లేనందుకు ఇటు ఫారెస్ట్ అధికారులు, రైతులు కొంత ఊపిరి పీల్చుకొన్నారు. శనివారం రాత్రి అర్ధ రాత్రి వరకు సదుం మండల పరిధిలో ఒక మోస్తారు వర్షం పడింది. శనివారం రాత్రి వర్షం తరువాత రాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో ఆదివారం తెల్లవారు జామున ఏనుగులు గుంపు మళ్లీ సదుం మండల పరిధిలోని రైతుల పంటలపై దాడులు చేసి పంటనష్టం కలిగించాయి. దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌటింగ్ రోజు ట్రాఫిక్ మళ్లింపు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ఎన్నికల కౌటింగ్‌ను దృష్టిలో వుంచుకొని పోలీసులు నగరంలోని ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాల మార్గంలో ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చిత్తూరు నుండి తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాద్ కు వెళ్లాల్సిన వారు ఇరువారం వైపుగా వెళ్లి అక్కడి నుండి కాఫీ డే (వరిగిపల్లి) జంక్షన్ నుంచి కుడివైపుకు తిరిగి 6 లైన్ హైవే వైపు, చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాద్ వెళ్లాలనుకునేవారు రెడ్డిగుంట జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి కాఫీ డే (వరిగిపల్లి) జంక్షన్ వద్దకు వెళ్లి అక్కడి నుండి కుడి వైపు తిరిగి 6 లైన్ హైవే వైపు.తిరుత్తని నుండి చిత్తూరు మీదుగా తిరుపతికి వెళ్లవలసిన వారు తానా జంక్షన్ నుండి జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకొని తిరుపతికి చేరుకోవాలి. తిరుత్తణి నుండి వేలూరు గాని, చెన్నై కి లేదా బెంగళూరుకు వెళ్లవలసిన వారు చిత్తూరు పట్టణం మీదుగా వెళ్లాలి. కడప – పీలేరు – తిరుపతి నుండి చిత్తూరు కు రావాలనుకున్న వారు రంగంపేట 6 లేన్ హైవే పై ఓవర్ నుండి (వరిగిపల్లి) జంక్షన్ మీదుగా చిత్తూరుకు చేరుకోవాలి. వావిలతోట – బండపల్లి – పూతలపట్టు, ఇతర చిన్న చిన్న గ్రామస్తులు చిత్తూరుకు రావాలనుకున్న వారు వారికి సమీపంలో ఉన్న 6 లేన్ హైవే పై ఓవర్ నుండి కాఫీ డే (వరిగిపల్లి) జంక్షన్ మీదుగా చిత్తూరు కు చేరుకోవాలి. తిరుపతి నుండి చిత్తూరుకు వచ్చే వారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధం. రంగంపేట పై ఓవర్ క్రాస్ నుండి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధించారు. కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులు మాత్రమే ఎస్‌వి సెట్ కాలేజీ వరకు అనుమతించారు. 2వ గేట్ ద్వారా ఆర్‌విఎస్ హాస్పిటల్ వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ అనుమతిస్తారు. ఏజెంట్లు, పోలీసు, ప్రెస్ వారి వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో పక్కన ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. పూతలపట్టు నుండి వచ్చే వాహనం ఎడమ వైపు సర్వీస్ రోడ్డులో అండర్ పాస్ ద్వారా నేరుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చు. మురకంబట్టు వైపు నుండి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి, ఆపై ఆర్‌విఎస్ నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి రహదారిపై నుండి మహర్షి పాఠశాల పార్కింగ్ స్థలం వైపు వెళ్లవచ్చు. 4వ తేదీన ఉదయం 4గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది.

సహకారం కరువు!

- పెచ్చులూడి పడుతున్న సహకార సంఘ భవనం
- భయం గుప్పెట్లో సిబ్బంది
- స్పందించని పాలకులు

ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఏమాత్రం వర్షం కురిసినా భవనం చెరువును తలపిస్తోంది. నిత్యం భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో భవనం పైకప్పు కమ్మిలతో దర్శన మిస్తోంది. ఎప్పుడు కూలిపోతుందోనని కార్యాలయ సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. సుమారు 60 గ్రామా లకు చెందిన 3 వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. రైతుల అవసరాలకు అను గుణంగా రుణాలు మంజూరు, ఎరువుల అమ్మకాలు, ఎరువుల నిలువల కోసం ఉపయోగించాల్సిన భవనం దుస్థితిలో ఉండడంతో రైతులకు ఎలాంటి అవసరాలకు ఉపయోగపడడం లేదు.

సంవత్సరాలు తరబడి దుస్థితిలో..

ఎంతమంది అధికారులు మారినా.. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా సహకార సంఘం దుస్థితి మాత్రం ఏమాత్రం మారడం లేదు. సంవత్సరాలు తరబడి దుస్థితిలో ఉన్న పూతల పట్టు సహకార సంఘాన్ని మాత్రం పట్టించుకోవడం లేదు. సహకార సంఘం అధ్యక్షుని (సింగిల్ విండో ప్రసిడెంట్) ఎన్నుకోవడానికి తప్ప మరి ఏ ఇతర కార్యకలాపాలకు ఉపయోగపడని దుస్థితిలో ఉంది. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని సహకార సంఘాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన భవనం



పెచ్చులూడి పడుతున్న భవనం



కొనసాగుతున్న భక్తుల రద్దీ

దర్శనానికి 24 గంటలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్‌లో ఉన్న వారికి ఉచితంగా మంచి నీళ్లు, అన్నప్రసాదాలను పంపిణీ చేస్తున్నారు. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లను కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు నుంచి నాలుగు గంటల సమయం పడుతుందని తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. బయట వరకూ క్యూలైన్ ఉంది. ఉచిత దర్శనం క్యూలైన్‌లో ఉదయం ఏడు గంటలకు టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం 24 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. స్వామివారిని 67,873 మంది భక్తులు దర్శించుకోగా 33,532 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ కానుకలు రూ. 3.93 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆదివారం తిరుమల శ్రీవారిని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ టీడీపీ అధికారంలోకి వస్తాయని, 53 శాతం ఓట్ షేరింగ్‌తో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడాలనే కసి ప్రజల్లో కనిపించిందని, పోస్టల్ ఓట్లు కూడా 90 శాతం ఏకపక్షంగా వేశారని, పోలింగ్ శాతం పెరగడం చూస్తే ప్రభుత్వ వ్యతిరేకత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు అని వ్యాఖ్యానించారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ టీడీపీకి అనుకూలంగా వచ్చాయని మాజీ మంత్రి నారాయణ అన్నారు. ఆదివారం నారాయణ వేంకటేశ్వర స్వామిని దర్శనానంతరం మీడియాతో మాట్లాడారు.

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి రోజా, నారాయణస్వామి

ఎగ్జిట్ పోల్స్ చెప్పిన జగన్ రెండోసారి సీఎం అవ్వడం ఖాయమని, ఏపీ ప్రజలు సంక్షేమానికి, అభివద్ధికి పట్టం కట్టారని, మహిళలు, వృద్ధులు రాత్రి వరకు క్యూలో నిలబడి ఓటు వేశారని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను టీడీపీ అనుకూలంగా మార్చుకోవడాని ప్రయత్నిస్తోందని, చంద్రబాబు ఎన్ని దొంగాటలు ఆడినా జగన్‌ని ఏమీ చేయలేరని అన్నారు. అలాగే శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ సీఎం జగన్ ను ప్రజలందరూ ఆశీర్వదించారని, వైసీపీ భారీ మెజారిటీతో గెలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

260 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు

- పోలీసుల అదుపులో 300 రౌడీషీటర్లు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లాకు 5 క్యుఆర్‌టి (చెక్‌రిలేషన్ టీమ్స్) వాహనాలను కేటాయించారు. కౌంటింగ్ అనంతరం అల్లర్లు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా పటిష్టం చేశారు. 260 గ్రామాలు సమస్యాత్మకంగా గుర్తించారు. ఈ గ్రామలపై పోలీసులు నిఘా ఉంచారు. ఎక్కడా చిన్న పాటి గొడవ చోటు చేసుకున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే అక్కడి కేంద్ర, రాష్ట్ర పోలీస్ బలగాలు చేరుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మరో వైపు కౌటింగ్ అనతరం అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకొనేలా కేసులు నమోదు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా ఎస్పీ హెచ్చరించారు. పోలింగ్ రోజున చోటు చేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని కౌటింగ్ అనతరం ఎలాంటి అల్లర్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 144, , 30 యాక్టు అమలు చేస్తున్నారు. కౌటింగ్ రోజును చిత్తూరు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. కౌంటింగ్ కేంద్రం, ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మూడు అంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు. పెనుమూరు క్రాస్ వరకు అందరిని అనుమతిస్తారు. అక్కడి నుండి కౌటింగ్ కేంద్రం వరకు అనుతించినా కౌటింగ్ ఏజెంట్లు, అభ్యర్థులను మాత్రమే అనుమతించనున్నారు. అభ్యర్థుల వాహన డ్రైవర్లను పార్కింగ్ వరకు అనుమతిస్తారు. మీడియా ప్రతినిధులకు కౌటింగ్ హాల్‌కు అనుమతి లేదు. మీడియా సెంటర్ వరకు అనుతిస్తారు.

కౌంటింగ్ రోజున పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో బాగంగా కౌంటింగ్ మొదలై ముగిసే వరకు కౌంటింగ్ కేంద్రం లోపల, వెలుపల నిర్దిష్ట దూరం వరకు వీడియో కెమెరా తో పటిష్ట భద్రత కోసం ఈ 5 క్యుఆర్‌టి వాహనాలతో వీడియో చిత్రీకరణ నిర్వహించనున్నారు. క్యుఆర్‌టి వాహనాలు లాఅండ్ ఆర్డర్ నిర్వహించడంలో, ఏదైనా నిరసనలకు వెంటనే స్పందించడంలో, ఈ కీలక సమయంలో పౌరుల భద్రతను నిర్ధారించడంలో ముఖ్యమైన పాత్ర పోషించనున్నాయి.

క్యుఆర్‌టి వాహనాల ఉద్దేశం

ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలు సంభవిస్తే వెంటనే స్పందించేందుకు క్యుఆర్‌టి వాహనాలు వ్యూహాత్మకంగా కేటాయించబడ్డాయి. వేగవంతమైన స్పందన: ఏదైనా నిరసన లేదా లాఅండ్‌ఆర్డర్ పరిస్థితిలో తక్షణ సహాయం అందించడం. నిరంతర పర్యవేక్షణ: కౌంటింగ్ కేంద్రం వద్ద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, జిల్లా అంతటా శాంతిని కొనసాగించడం. నిరోధకత: బలమైన పోలీస్ ఉనికితో ఏదైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధిం చడానికి.

అధునాతన పర్యవేక్షణ కెమెరాలు

క్యుఆర్‌టి వాహనాల ప్రత్యేక లక్షణాలలో ఒకటి అధునాతన పర్యవేక్షణ కెమెరాలు వినియోగించనున్నారు. ఈ కెమెరాలు వాహనాల చుట్టూ జరిగే అన్ని కార్యకలాపాలను రికార్డ్ చేయడానికి రూపొందించారు. ఈ నెల 4వ తేదీ జరిగే ఎన్నికల లెక్కింపు రోజున తక్షణమే వీడియో ఫుటేజీ, డాక్యుమెంటేషన్ అందించడానికి ఉపయోగపడుతుంది.

నిరంతర పర్యవేక్షణ: ఈ కెమెరాలు రోజంతా పనిచేస్తూ, చుట్టు పక్కల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తాయి.

సాక్ష్యాల సేకరణ: ఏదైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగితే, రికార్డ్ చేసిన ఫుటేజీ చట్టపరమైన చర్యలకు ముఖ్యమైన సాక్ష్యంగా పనిచేస్తుంది. ఇది నేరస్థులపై ఫిర్యాదులను వేగంగా దాఖలు చేయడంలో సహాయ పడుతుంది.

స్వచ్ఛత: పర్యవేక్షణ కెమెరాల ఉనికి లా అండ్ ఆర్డర్ నిర్వహించడంలో స్వచ్ఛతను ప్రోత్సహిస్తుంది.

సెక్షన్ 144

శాంతిభద్రతలను పరిరక్షించడానికి సెక్షన్ 144 జిల్లాలో అమలు చేస్తున్నారు. ఈ సెక్షన్ ప్రజా స్థలాల్లో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ వ్యక్తులు గుమికూడడాన్ని నిషేధిస్తుంది. నిరసనలు లేదా చట్టవిరుద్ధ సమావేశాలు నివారించడానికి, ముగ్గురు కంటే ఎక్కువ మంది లేకుండా ప్రజలు ముగ్గురికంటే ఎక్కువగా గుంపుల్లా తిరగడానికి అనుమతి లేదు. ఈ చర్య నిరసనలు అధికం కాకుండా నివారించడానికి అత్యంత కీలకం. సెక్షన్ 144 ఉల్లంఘిస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటారు. క్యుఆర్‌టి వాహన కెమెరాల నుండి రికార్డ్ చేసిన ఫుటేజీ ఉల్లంఘనలను గుర్తించడానికి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోడానికి ఉపయోగపడతుంది.

శాంతిభద్రతలకు సహకరించండి..



జిల్లా ప్రజలు ఈ నియమాలను ఖచ్చితంగా పాటించాలి. ప్రతి ఒక్కరూ పూర్తిగా పోలీసులకు, ఇతర భద్రతా సిబ్బందికి సహకరించడం చాలా ముఖ్యం. నియమాలను అనుసరించడం ద్వారా, ప్రజలు ఎన్నికల లెక్కింపుని శాంతియుతంగా నిర్వహించడంలో గణనీయంగా సహకరించవచ్చు. లెక్కింపు రోజున అమలులో ఉన్న ఆంక్షలు ,మార్గదర్శకాలను తెలుసుకోవాలి. కేవలం అవసరమైన కార్యకలాపాలకు మాత్రమే ప్రయాణాన్ని పరిమితం చేయండి. ప్రజా స్థలాల్లో గుంపులుగా తిరగ డం నివారించండి. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలా పాలను నిర్వహిస్తుంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100/112 కు లేదా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9440900005 కు తెలపాలి

- మణికంఠ ఛందోలు, జిల్లా ఎస్‌పి.

గుంతల దారి.. మారదా మరి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీలోని అగ్రహారం నుండి కొత్త వెంకటాపురం మీదుగా తమిళనాడు వాడ వరకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి కంకర రాళ్లు తేలి పోయింది. దీంతో ఈ దారిలో ద్విచక్ర వాహనాలు, పాల వ్యాన్లు, కార్లతో పాటు చిత్తూరు - కొత్త వెంకటాపురానికి ఆర్‌టిసి బస్సు సర్వీసులు రాకపోకలు సాగిస్తుంటాయి. అప్పుడప్పుడు టైర్లు పంక్చర్లు కావడం, షేక్ ఆఫ్ స్ప్రింగ్లు, ప్లేట్లు విరిగి పోయి వాహనదారులు నానావస్థలు పడుతున్నారు. గుంతల మయంగా ఉన్న రోడ్డులో గత పదేళ్లుగా నిత్యం అవస్థలు పడుతూ సాగిస్తున్నా మని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. సుమారు ఒకటిన్నర కిలోమీటరు మేర రోడ్డు నిత్యం తమిళనాడులో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగే ఈ రోడ్డులో అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇకనైనా ఈ గుంతల రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

ఐదేళ్లుగా పోరాడుతున్నాం..

ఈ రోడ్డును గుంతల మయం లేకుండా చేయాలని ఐదు ఏళ్లుగా పోరాడుతున్నా కుదరలేదు. ఈ ప్రాంత వాహనదారులు తమిళనాడుకు నిత్యం రాకపోకలు సాగించేవారు. మండల సరిహద్దులో ఉన్న రోడ్డును బాగు చేయాలని అధికారులకు పలుసార్లు చెప్పినా పట్టించు కోలేదు. రాత్రి పూట వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నాం.



అగ్రహారం నుండి గుంతల మయమైన తమిళనాడు పోయే రోడ్డు



బెల్లంకొండ అశోక్ నాయుడు మాజీ సర్పంచ్, కొత్త వెంకటాపురం పంచాయతీ.

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సిందే..!

ఈ రోడ్డున వెళ్లాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాలి.. వర్షం పడితే నరకయాతన పడాల్సిందే.. కొన్ని వస్తువులు, సరుకులు తక్కువ ధరలు ఉంటాయి. అవి కొనాలంటే మాకు దగ్గరలో ఉన్న తమిళనాడులోని పొన్నై వెళ్లి వస్తుంటాం..

- కె. నిరంజుల్లు రెడ్డి, తూగుండ్రం గ్రామం, గంగాధర నెల్లూరు మండలం.





ప్రజలతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్‌ఐ వెంకట నరసింహులు

సమస్యాత్మక గ్రామాల్లో ఎస్ఐ సమావేశం

ప్రజాశక్తి-సోమల: సోమల మండలంలోని పెద్ద ఉప్పరపల్లి, పేటూరు, ఆవులపల్లి పంచాయతీ ప్రజలతో ఎస్ఐ వెంకట నరసింహులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఫలితాల రోజు ఎలాంటి సంబరాలు, ర్యాలీలు, టపాసులు కాల్చడం చేయ కూడదని గొడవలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొల్పే విధంగా ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర



జాతరకు సందర్శించిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి

ప్రజాశక్తి -గంగవరం: గంగవరం మండలం మేలుమాయిలో ముత్యాలమ్మ జాతర ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి టిడిపి శ్రేణులతో కలిసి పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వారు మొక్కులు తీర్చుకున్నారు. అంతకు ముందు గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నియోజక వర్గంలో వర్షాలు విరివిగా కురిసి పంటలు బాగా పండాలని ఆయన కోరుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గంగవరం మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు లేకుండా చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: ఎన్నికల కౌంటింగ్ ఈ నెల 4వ తేదీ వున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ మణికంఠ ఆదేశాల మేరకు డీఎస్పీ, సిఐ ఆధ్వర్యంలో సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని యాదమరి ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తప్పని సరిగా ఈ సూచనలు పాటించాలన్నారు. నలుగురు లేక అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తులు ఒక చోట గుమిగూడి వుండకూడదని, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు ఊరేగింపులు నిర్వహించకూడదని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడే రోజు, ఆ తరువాత ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. డిజె లకు, బాణసంచా అమ్మకాలు, బాణసంచా కాల్చడానికి అనుమతులు లేవని తెలిపారు. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమించినా, అల్లర్లకు పాల్పడినా, గొడవలను ప్రోత్సహించినా వారిపై చట్ట పర కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో, వాట్సప్ గ్రూప్‌లలో గాని రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఘనంగా స్టేట్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గంగాధనెల్లూరు మండల కేంద్రంలోని గుణశేఖర్ రెడ్డి స్వగృహంలో ఆదివారం గుణశేఖర్ రెడ్డి జన్మదిన సందర్భంగా మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి, గుణశేఖర్ రెడ్డికి శాలువాతో, పుష్పగుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సత్కారం

ప్రజాశక్తి-వెంకటగిరి: పట్టణంలోని ప్రణతి సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో వెంకటగిరిలో ప్రతిభ చాటి వెంకటగిరి టౌన్ ఫస్ట్‌గా నిలిచి 600/592 మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థులు నిఖిలేష్, హాసినిలను ఆదివారం సత్కరించి షీల్డ్, పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ప్రణతి సంస్థ గౌరవాధ్యక్షులు బోడి చర్ల సుబ్బయ్య, సరస్వతమ్మ, అధ్యక్షులు సుంకర రవికుమార్, ఉదయగిరి రాఘవేంద్ర, ఎద్దల భాను రేఖ తదితరులు పాల్గొన్నారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-బాలాయపల్లి: ఎన్నికల నియమాలు ఉలంఘిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ మహబూబ్ సుభాన్ పేర్కొన్నారు. ఆదివారం ఎగ్జిట్ పోల్ వెల్లడిపై ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాయపల్లి మండలంలో మూడు గ్రూపులుగా ఏర్పాటు చేసి ప్రత్యేకనిగా పెట్టమన్నారు. బాలాయపల్లి బస్టాండు వద్ద ఏఎస్ఐ రామేశ్వర రావు, వెంగమాంబ పురం బస్టాండ్ వద్ద ఏఎస్ఐ మాల్యాద్రి, మొబైల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎగ్జిట్ పోల్ నిబంధనలు తొలగిస్తే కఠినమైన చెరుకు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

హింసాత్మక ఘటనలకు తావు లేదు..

- ట్రైనింగ్ ఎస్పి దేవరాజ్ మనీష్ పటేల్

ప్రజాశక్తి-రామచంద్రపురం: కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు తావు ఉండరాదని ట్రైనింగ్ ఎస్పి దేవరాజు మనీష్ పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని కుప్పం బాదూరు, పరమాల గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 144సెక్షన్, 30యాక్ట్ అమల్లో ఉండటం గుర్తు చేశారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు తావు ఉండరాదని ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను ఉపేక్షించేది లేదన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఓట్ల లెక్కింపు వేళ విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. అలాగే బాణాసంచా విక్రయం, పేల్చడం నిషేధమని తెలిపారు. గ్రామస్తులకు పోలీస్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో రాజకీయాలకు అతీతంగా అందరూ ఐకమత్యంగా ప్రశాంత వాతావరణంలో ఉండాలన్నారు. రామచంద్రాపురం మండలంలో అనుపల్లి, ఎన్ఆర్ కమ్మపల్లి, పరమాల, సి.రామాపురం, రావిళ్ళవారిపల్లి, నడవలూరు గ్రామాలలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. కార్యక్రమంలో చంద్రగిరి ఇన్‌ఛార్జ్ డిఎస్పి రవికుమార్, ఎస్ఐ చిరంజీవి, కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

- అన్నిఏర్పాట్లు పూర్తి- ర్యాలీల నిర్వహణకు అనుమతులు లేవు- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఈ నెల 4వ తేదీ శాంతియుత వాతావరణం లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ను విజయవంతంగా పూర్తి చేసేందుకు సన్నద్ధంగా ఉన్నామని ఆదివారం మధ్యాహ్నం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. షణ్మోహన్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు సంయుక్తంగా విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు– 2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా లో ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేస్తున్నామని, సజావు గా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ప్రజలు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. కౌంటింగ్ రోజున శాంతి భద్రతలు కాపాడేందుకు ట్రాఫిక్ ఆంక్షలు అనివార్యం. ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. 4వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా చిత్తూరు జిల్లాకు సంబంధించి ఎస్‌వి సెట్ కాలేజీ లో జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో శాంతి భద్రతలు కాపాడేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు చిత్తూరు పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. జిల్లాకు సంబంధించి పూతలపట్టు మండలం ముత్తు రేవుల వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రం గా ఉన్న శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ లో నిర్వహిస్తామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు ఎస్ సి పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిమిత్తం 15 కౌంటింగ్ హాల్స్ లో ఏర్పాటు చేయగా, ఏడు నియోజక వర్గాలకు ఏడు హాల్స్, చిత్తూరు పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి 7 హాల్స్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఒక హాలు కేటాయించడంజరిగిందన్నారు.. ఓట్ల లెక్కింపనకు ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ను ఏర్పాటు చేశామని , పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు మూడు టేబుల్స్ చిత్తూరు పార్లమెంటు నియోజక వర్గం సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ల లెక్కింపుకు 18 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. 4 న ఉదయం 5గంటల కల్లా కౌంటింగ్ ఏజెంట్లు, సిబ్బంది కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్ ఫోన్స్ కు అనుమతి లేదని, ఇందుకు సెల్ ఫోన్ లు భద్రపరిచేందుకు కౌంటర్ల ను ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి టేబుల్ కేటాయింపు అదే రోజున ఉదయం 5 గంటలకు తెలుపుతామన్నారు. ఈ వి ఎం లలో పుంగనూరు పార్లమెంట్ నియోజక వర్గానికి సంబంధించి పోలైన ఓట్ల వివరాలను రాయచోటి కి మనం ఇవ్వాలని, చిత్తూరు పార్ల మెంట్ నియోజక వర్గానికి సంబంధించి చంద్రగిరి పార్లమెంటు నియోజక వర్గం వివరాలను తిరుపతి జిల్లా వారు మనకు అందించామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఐదు మంది పరిశీలకులను నియామకం చేశారని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నకు ఎండి సాధిక్ ఆలం, పుంగనూరు నియోజకవర్గానికి కవిత ఎస్ మనికేరి, పలమనేరు కుప్పం నియోజకవర్గాలకు సంబంధించి బి.కె. మమత, నగరి నియోజకవర్గానికి సంబంధించి భరత్ భూషణ్ జీడీ నెల్లూరు పూతలపట్టు నియోజక వర్గాలకు సంబంధించి అఖోరి శశాంక్ సిన్హా లు నియమితులయ్యారన్నారు. ఎస్ వి సెట్ ఆడిటోరియంలో మీడియా సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని మీడియా అథారిటీ లెటర్లు పొందిన వారికి మీడియా సెంటర్ వరకు ఫోన్ లు అనుమతి కలదని రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలను మీడియా కేంద్రం నుంచి విడుదల చేస్తామన్నారు. పూర్తి స్థాయిలో కట్టు దిట్ట మైన భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామని, ఎలాంటి ఉల్లంఘన జరిగినాఉపేక్షించేది లేదని తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత వ్యవస్థ వుందన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ ఓ బి పుల్లయ్య, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

అంకిత భావంతో అందరి మన్ననలు పొందారు..

డాక్టర్ రవిరాజు ఉద్యోగ విరమణ సన్మాన సభలో తిరుపతి జిల్లా డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీహరి ప్రశంసలు

ప్రజాశక్తి - వెదురుకుప్పం, కార్వేటినగరం : సామాన్య రైతు కుటుంబంలో ఓ మారుమూల గ్రామం కార్వేటినగరం మండలం ఆర్‌కెవిబి పేటలో పుట్టి ఎంబిబిఎస్ చదివి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిగా, జిల్లా నోడల్ అధికారిగా, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిగా డాక్టర్ రవి రాజు అంకిత భావంతో పనిచేసి అందరి మనన్నలు పొందారని తిరుపతి జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరి ప్రశంసించారు. ఆదివారం పుత్తూరులో జిడిఆర్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ సన్మాన సభకు జిల్లా అడిషనల్ వైద్యాధికారి రవికుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఉద్యోగ విరమణ సన్మాన సభలో డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ వైద్య వృత్తిలో డాక్టర్ రవి రాజు అంకిత భావంతో పనిచేసి అందరి మన్ననలు పొందరాని పేర్కొన్నారు. కార్వేటినగరం మండలంలో కోదండ రామాపురం, ఎర్రమరాజు పల్లి ఆంథ్రాక్స్ మనుషులకు, జంతువులకు రావడంతో రవిరాజు దాన్ని అదుపు చేశారని గుర్తు చేశారు. అటు మనుషులకు, జంతువులకు నష్టం లేకుండా చికిత్స అందించి సేవలు చేశారని తెలిపారు. కరోనా సమయంలో రోజూ రోగులకు ట్రీట్‌మెంట్ ఇచ్చి రోగులలో ఎంతో ధైర్యం నింపారన్నారు. కార్వేటినగరం పెద్ద దళితవాడలో మహిళకు కడుపులో ఉన్న 70 కేజీలు గడ్డను తొలగించిన ఘనత డాక్టర్ రవి రాజుకే దక్కిందన్నారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేసే వ్యక్తి రవి రాజు అని కొనియాడారు. సిద్ధార్థ కళాశాల ఛైర్మన్ అశోక్ రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పని చేయడంతో అందరి మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి డాక్టర్ రవి రాజు అని వివరించారు. సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ పేదల పట్ల ప్రత్యేక అభిమానం ఉండేదని అందుకే మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తి రవిరాజు అన్నారు. డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేశానని తెలిపారు. తాను ఎందరో పేదలకు సేవ చేశానని, తమ కుమార్తెలు సైతం డాక్టర్లుగా సేవలు అందిస్తున్నారన్నారు. తన తల్లిదండ్రుల ఆశీర్వాదంతోనే ఇంత స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ రవి రాజు, అనురాధ దంపతులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామరాజు, డాక్టర్ జయరామయ్య, సురేంద్ర రాజు, యువరాజు, నాగేశ్వరరావు, భాస్కర్ రాజు, డాక్టర్ ప్రభావతి, డాంక హమీద్, ఎంపీపీ లత బాలాజీ, సర్పంచ్ ధనంజయ వర్మ, ఎంఈఓ తిరుమల రాజు, మాజీ ఎంఈఓ సుకుమార్, మాజీ జెడ్పిటిసి దేవకీ లోకనాథరెడ్డి, రాధాకృష్ణ యాదవ్, పలువురు పాల్గొన్నారు.



డాక్టరు రవిరాజు దంపతులను సన్మానిస్తున్న అతిథులు

గోపీచంద్ సేవలు చిరుస్మరణీయం: డ్వామా పీడీ

ప్రజాశక్తి-రామచంద్రపురం: ఉపాధి హామీ పథకంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్గా బి.గోపీచంద్ జిల్లా ప్రజలకు ఎనలేని సేవలందించారని, ఆయన సేవలు చిరుస్మరణీయమని తిరుపతి జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ కొనియాడారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఉద్యోగ విరమణ మహోత్సవ సన్మాన కార్యక్రమం జరిగింది. విజయవాడలో ఏపీఈడబ్ల్యూ ఐడిసి చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదవి విరమణ పొందడం ఆనందదాయకమని శ్రీనివాసప్రసాద్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా డ్వామా నందు 8 ఏళ్లు ఏపీడిగా పనిచేసి ఉపాధి హామీ పథకాన్ని సమర్ధవంతంగా నిర్వహించి రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచేటట్లు చేయడంలో గోపీచంద్ పాత్ర కీలకమని పలువురు వక్తలు కొనియాడారు. విజయవాడ నాడు–నేడు పథకంలో చీఫ్ ఇంజనీరుగా సమర్ధవంతంగా విధులు నివర్తించి ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, నగిరి ఏపీడి టిఎన్ శోభన్ బాబు పేర్కొన్నారు. 38 సంవత్సరాలు ప్రభుత్వ శాఖలలో వివిధ హోదాలో మచ్చ లేకుండా సేవలందించిన వ్యక్తి గోపీచంద్ అని సూళ్లూరుపేట ఏపీడి రవికుమార్ అన్నారు. అనంతరం గోపీచంద్ దంపతులను దుశ్శాలువలు, గజ పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆనంద రెడ్డి, డిఈ భాస్కర్, రాష్ట్ర ఉపాధి హామీ మాజీ కౌన్సిల్ సభ్యులు సింగంశెట్టి సుబ్బరామయ్య, ఏపీఓలు జ్యోతి శ్రీ, సంధ్యారాణి డ్వామా సిబ్బంది భాను, రాంబాబు, రాజేష్, గురు, సురేష్ పాల్గొన్నారు.



ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలోని జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో నెలరోజులపాటు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ హబ్ వారి సహకారంతో డాక్టర్ ధనంజయులు సారధ్యంలో మే 1 వ తేదీ నుండి నెల రోజులపాటు ఈ వేసవి శిక్షణ తరగతులు జరిపించారు. 9వ తరగతి నుంచి 10వ తరగతి వెళుతున్న విద్యార్థులకు 10వ తరగతిలో పాఠ్య పుస్తకాలలో వచ్చే అంశాలపై ముందుగా 18మంది ఉపాధ్యాయుల చేత శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ పొందిన విద్యార్థులకు పరిసుఖాలు నిర్వహించు ప్రతిభ కనపరిచిన వారికి డాక్టర్ ధనుంజయ చేతులు మీదుగా జ్ఞాపికలను అందజేశారు. అలాగే ఈ శిక్షణ ఇవ్వడంలో ఉత్సాహం కనపరిచిన రిటైయిడ్ షార్ ఉద్యోగి మధు సింగ్‌ను ఘనంగా సన్మానించి, సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.జే.రాజశేఖర్, ప్రభాకర్, చెంగయ్య, రవి, రామ్మూర్తి, బాబు, రాజేష్, మస్తాన్, రమణయ్య, జగన్, భాస్కర్, సుజన, అరుణ, ఉషా, సునీల, శైలజ, దివ్య పాల్గొన్నారు.





దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ముగిసిన మహాభారత ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని తయ్యూరు ఆయకట్టు వివిపురం గ్రామ పంచా యతీ అంకన పల్లిలో వెలసిన ద్రౌపదీ దేవి ఆలయ ఆవరణలో ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అలరిం చింది. మహా భారత ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో దుర్యోధుని ప్రతిమను మట్టితో ఏర్పాటు చేయ గా భీముడిగా సత్తన్న దుర్యోధనుడిగా గోవిందరాజులు వేషధారణ చేసి ప ద్యాలు, పాటలు పాడుతూ జనాన్ని ఆకట్టుకున్నారు. మడుగులో దాగిన దుర్యోధ నుడిని భీముడు లాగి వధించిన ఘట్టం నిర్వహించారు. ధర్మరాజుకి పట్టాభిషేకం మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగారెడ్డి , డిసెంబర్ శెట్టి ,గోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచులు రఘునాథ రెడ్డి , వరదమ్మ , దామోదర్ నాయుడు, ధనంజయుల రెడ్డి, వైస్ సర్పంచ్ దామోదర్ ఆచారి, చంద్రా రెడ్డి , రామనాథ రెడ్డి, లోకనాథ్ రెడ్డి అడ్వకేట్ల గురవయ్య, నరసింహులు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ కుంభాభిషేకం



ప్రజాశక్తి -వెదురుకుప్పం: కార్వేటి నగరం మండలంలోని సమీపం లోని అమ్మగారితోట ఎస్వీఎస్ నగర్‌లో నూతనం గా నిర్మించిన శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం కుంభాభిషేకం ఘనంగా నిర్వ హించారు. ఈ కుంభాభిషేకాన్ని ఎస్వీ ఎస్ నగర్‌వీధి కుటుంబాల ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు అభిషే కాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామస్తులు స్వామిని దర్శిం చుకున్నారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పిడుగు పాటుకు పశువుల మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పిడుగుపాటుకు పశువులు మృతి చెందిన సంఘటన పుత్తూరు రూరల్ మండలంలోని పరమేశ్వర మంగళం పంచాయతీలో ఆదివారం వెలుగుచూసింది. జయరాంపురం గ్రామానికి చెందిన పాడి రైతు శ్యామలకు చెందిన ఐదు పశులను ఇంటి సమీపంలోని చింతచెట్టు వద్ద కట్టేసి ఉంచారు. ఆదివారం ఉదయం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఉన్న ఐదు ఆవులు మరణించడంతో ఆదరవు కోల్పోయిన మహిళా పాడి రైతు బోరున విలపించింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చెస్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల బాలికల చెస్ పోటీ విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. యూత్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ విజేతలకు షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిల్డ్రన్స్ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ గత 20ఏళ్లుగా చిన్నారుల్లో దాగి ఉన్న మేధోశక్తిని పెంపొందించేందుకు చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన చిన్నారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గౌరవాధ్యక్షులు శ్యాంబాబు, సెక్రటరీ సురేష్ బాబు, యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ప్రెసిడెంట్ హేమ కుమార్, ట్రెజరర్ నారాయణ, సభ్యులు శ్రీనివాసులు, సురేష్ బాబు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం

- పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వివేకానంద పాఠశాలలో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం బలిజ విద్యా దీవెన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ విద్యా దీవెన నిర్వహుకులు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం ఎంచుకొని ఆ లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో ప్రతిభ చాటిన 11మంది విద్యార్థులకు 5వేల చొప్పున నగదును అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘ సభ్యులు రమణయ్య, రాఘవయ్య, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

మినీ ట్రాన్స్ పోర్ట్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం గూడూరు వివేకానంద రోడ్డులోని "మినీ లారీ ట్రాన్స్పోర్ట్" కార్మికులు సీఐటీయూ సభ్యత్వాలు తీసుకొని నాయకుల సమక్షంలో యూనియన్‌లో చేరారు. నూతన కమిటీ ఎన్నికలో భాగంగా అధ్యక్షులుగా ఏ.రాజగోపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.సుధాకర్, కార్యదర్శి మోడి.ఈశ్వరయ్య, సహాయ కార్యదర్శి ఎన్.మస్తాన్, ట్రెజరర్ డి.వేణు, ఏ.విజయ్ చంద్ర, ఏడు మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును హైదరాబాదులోని ఆయన స్వగృహంలో ఆదివారం శ్రీకాళహస్తి నియోజక వర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు విదేశీ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి హైదరాబాద్ వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వ కంగా కలిసి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరి గిన పోలింగ్ సరళని వివరించి గెలుపుపై ధీమా ను వ్యక్తపరిచారు. శనివారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్‌లో కూటమికి ఏకపక్ష విజయావకాశాలు వెల్లడించడంపై హర్షం వ్యక్తం చేశారు.